క్లుప్తంగా

పద్మశాలి సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఎన్నిక


శ్రీరామదాసు వెంకట్

సిద్దవటం : ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సిద్దవటం మండలం మాధవరం–1 గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరామదాసు వెంకట్‌ను ఎన్నుకున్నారు. ఈ కమిటీని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింక విజయలక్ష్మి ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సేవా సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలిగా జింకా విజయలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షులుగా మాదా జానకిరామయ్యను, ప్రధాన కార్యదర్శిగా శ్రీరామదాసు వెంకట్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాధవరం–1 గ్రామంలో బుధవారం వెంకట్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు ఏ.పి. పద్మశాలి సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పదవిని కట్టబెట్టినందుకు గౌరవ అధ్యక్షురాలు విజయలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంను కలిసిన మర్రి రవి


సీఎంను కలిసిన మున్సిపల్ వైస్ చైర్మన్

రాజంపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజంపేట కాపునేత, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి బుధవారం కలిశారు. రాజంపేట ఎంపీ అభ్యర్థి పీవీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో సదుంలో సీఎంను కలిశారు. ఈ సందర్భంగా మర్రి రవి ఇక్కడి విలేకర్లతో మాట్లాడుతూ కాపులను చైతన్యపరిచి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. సీఎం ఆదేశాల మేరకు కాపు సామాజికవర్గం నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

పాఠశాలలో ఎనర్జీ క్లబ్


సేవ్ ఎనర్జీ.. సేవ్ ఎర్త్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గాలివీడు : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఎనర్జీ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు బి.దుర్గేశ్వరరాజు మాట్లాడుతూ విద్యార్థినుల్లో వివేకం, స్థిరమైన శక్తి వినియోగం వంటి విషయాల్లో వారిని చైతన్యపరచడమే క్లబ్ లక్ష్యమన్నారు. భూమిపై పరిమితమైన శక్తి సరఫరా ఉందని, పునరుత్పత్తికి చాలా సమయం పడుతుందని, అందుకే భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని ఎనర్జీ శక్తిని ఆదా చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నందలూరు(రాజంపేట) : కడప – చెన్నై జాతీయ రహదారిలోని మూసివేసిన ఆల్విన్ కర్మాగార సమీపంలో ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో బుధవారం ఉదయం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాముడు, పోలీసులు మహేంద్ర, కేంద్ర బలగాల పోలీసులు పాల్గొన్నారు.

నేడు నడివీధి గంగమ్మ జాతర

ఒంటిమిట్ట : మండల కేంద్రంలో వెలసిన నడివీధి గంగమ్మ జాతరను గురువారం నిర్వహించనున్నారు. వేకువజామున అమ్మవారిని గ్రామ ఆచారం ప్రకారం గ్రామంలోని ఆసాదులను గ్రామస్తులు సత్కరిస్తారు. అనంతరం ఆసాదులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించి స్వగృహం నుంచి పురవీధుల గుండా నడివీధి గంగమ్మను ఉత్సవమూర్తిని గుడి వద్దకు తీసుకురానున్నారు. జాతరను పురస్కరించుకొని గ్రామం మొత్తం ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామున అమ్మవారికి పెద్దఎత్తున జంతు బలులు, కాయాకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు.

పీటీఎంలో ముగిసిన గంగ జాతర

పెద్దతిప్పసముద్రం : పీటీఎం, రంగసముద్రం, అంకిరెడ్డిపల్లి, మడుమూరు, మద్దయ్యగారిపల్లి తదితర గ్రామాల్లో రెండు రోజులుగా నిర్వహించిన గంగ జాతర ముగిసింది. పీటీఎంలో నడివీధి నల్లగంగమ్మ జాతర వేడుకలు బుధవారంతో ముగిసాయి. జాతరలో భాగంగా భక్తులు గంగమ్మకు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. మహిళలు చలిపిండి దీపాలతో జ్యోతులు మోశారు. స్థానిక సంత బజార్‌లో ప్రతిష్ఠించిన గంగ, గౌరీ ప్రతిమల ఎదుట మండల వాసులే గాక కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి జాతరను తిలకించారు.

బాబు వెన్నుపోటు..
పింఛన్‌దారుల మండిపాటు


రాజంపేట: నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె సచివాలయం వద్ద..


పట్టణంలోని సచివాలయం-3 వద్ద పింఛన్ల కోసం వేచివున్న వృద్ధులు

- మండుటెండలో వృద్ధులు, దివ్యాంగుల పడిగాపులు
- వితంతువుల పరిస్థితి వర్ణణాతీతం
- తమకు ఇన్ని కష్టాలకు గురి చేసిన బాబుని దుయ్యబట్టిన పింఛన్‌దారులు

రాజంపేట : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కుట్రలతో బుధవారం రాజంపేట నియోజకవర్గంలోని రాజంపేట మున్సిపాలిటీ, నందలూరు, సిద్దవటం, వీరబల్లి, సుండుపల్లె, ఒంటిమిట్ట మండలాల్లో పింఛన్‌దారులు ఇక్కట్లపాలయ్యారు. ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మాకు పింఛన్లు ఇస్తే చంద్రబాబు ఎందుకంతా మంట అంటూ పింఛన్‌దారులు పెదవి విరిచారు. ఉదయాన్నే పంచాయతీలలోని సచివాలయాలకు పింఛన్‌దారులు చేరుకున్నారు. గంటల తరబడి పింఛన్ తీసుకునేందుకు పడిగాపులు కాశారు. సాయంత్రం వరకు పింఛన్ల కోసం ఉన్న కొందరికి పింఛన్లు అందించారు. చంద్రబాబు నిర్వాకం తమకు ఇంత ఇబ్బందులు వచ్చాయని విమర్శలు లబ్ధిదారుల నుంచి వ్యక్తమయ్యాయి. కాగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభమైందని రాజంపేట ఆర్డీఓ మోహన్‌రావు చెప్పారు.

ఎండలో పింఛన్ కోసం ఎదురుచూపులు

గాలివీడు : మండలంలో వృద్ధులు, దివ్యాంగులు తమ పెన్షన్ల కోసం సచివాలయాల వద్ద బారులు తీరారు. మండలంలో పెన్షన్‌పై ఆధారపడి జీవించే వృద్ధుల సంఖ్య గణనీయం. పెన్షన్లు కోసం భానుడి భగభగలను సైతం ఓర్చుకొని ఎలా అయినా పింఛన్ తీసుకొని వెళ్లాలి అనేవారికి నిరాశే ఎదురైంది. గతంలో జగనన్న పాలనలో సూర్యుడు ఉదయించకముందే వలంటీర్లు ఇంటి ముంగిటకే అందేదని, ఇప్పుడు చంద్రబాబు చేసే కుట్ర రాజకీయాలకు వృద్ధులను ఎండలో తిప్పుతున్నారని, మూడు రోజులు అవుతున్నప్పటికీ పెన్షన్‌ను అందించకపోవడంతో ఆవేదన వ్యక్తం చెందుతున్నారు.


గాలివీడు: నూలివీడు గ్రామ సచివాలయం ఎదుట పడిగాపులు కాస్తున్న వయోవృద్ధులు

పింఛన్ లబ్ధిదారుల కష్టాలు

రాజంపేట టౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ పథకాలు ఇంటి వద్దకే అందుతున్నాయి. అలాగే పింఛన్ కూడా ప్రతి నెల ఒకటవ తేదీ తెలవారుతున్న సమయానికే పింఛన్ సొమ్మును వలంటీర్లు లబ్ధిదారుల చేతిలో పెట్టేవారు. అయితే టీడీపీ హయాంలో పెత్తందారులకే మేలు చేస్తూ పేదలపై వివక్ష చూపే తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మరోసారి పేదలపై విషం చిమ్మారు. వలంటీర్ల వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ పొందే లబ్ధిదారులకు బాబు పుణ్యమా అని ఈ నెల కష్టాలు వచ్చి పడ్డాయి. చంద్రబాబు కుట్ర పన్ని మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ చేత వలంటీర్లు పింఛన్‌లు పంపిణీ చేయకుండా నియంత్రించాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించడంతో పింఛన్ల పంపిణీకి ఎన్నికల కమిషన్ వలంటీర్లను దూరం పెట్టింది. దీంతో పింఛన్లు పొందే అవ్వతాతలు, దివ్యాంగుల కష్టాలు వర్ణణాతీతమయ్యాయి. పింఛన్‌దారులంతా పేదలైనందున మాత్రలకు, ఇంటి ఖర్చుల కోసం వెంటనే పింఛన్ తీసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలకు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో సిబ్బంది పింఛన్‌దారులకు క్యూలో రావాలని చెప్పడంతో ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు నిలుచుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనేక మంది వృద్ధులు చంద్రబాబునాయుడుపై శాపనార్థాలు పెట్టారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : పింఛన్ అందకపోవడంతో బుధవారం మండల వ్యాప్తంగా సచివాలయల వద్ద పండుటాకులు పడిగాపులు కాశారు. ఉదయం ఇవ్వకపోవడంతో మధ్యాహ్నం మండుటెండలో పింఛన్ కోసం వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. గాదెల, జీవీపురం సచివాలయాలకు ఉదయమే వృద్ధులు పింఛన్ కోసం దూరం నుంచి నడుచుకుంటూ వచ్చారు. వారి ఇబ్బందులు గమనించి స్థానిక వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు చిన్నరెడ్డి అశోక్‌రెడ్డి మంచి నీళ్లు, అల్పాహారం అందజేశారు. అంతేగాకుండా లబ్ధిదారులు ఇంటికి వెళ్లేందుకు ఆటోలను ఏర్పాటు చేశారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : ప్రతి నెలా ఒకటవ తేదీ ఉదయం 5 గంటలకే అవ్వాతాతలకు ఇళ్లు తలుపు తట్టి పింఛన్లు అందిస్తూ.. వారి ముఖంలో చిరునవ్వులు నింపేది వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం. వలంటీర్ల ద్వారా నేరుగా ఇళ్ల వద్దకే పింఛన్లు పంపిణీ చేస్తూ వారికి అండగా నిలిచేది. ఇది చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ఎన్నికలను అడ్డుపెట్టుకొని పింఛన్ లబ్ధిదారులపై అక్కసు వెళ్లగక్కింది. ఫలితంగా ఇప్పటి వరకూ ఇళ్ల వద్దే పింఛన్లు పొందుతున్న పండుటాకులైన అవ్వాతాతలతోపాటు దివ్యాంగులు గడప దాటి మండుటెండలో ఆయా గ్రామాలలోని సచివాలయాలకు పింఛన్ కోసం వచ్చి పడిగాపులు కాశారు.

చంద్రబాబు కుట్రతో అష్టకష్టాలు

రైల్వేకోడూరు : ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు వల్ల తమకు ఇంత దయనీయ పరిస్థితి వచ్చిందని పింఛన్ల కోసం సచివాలయాల వద్ద పడిగాపులు కాసిన వృద్ధులు, దివ్యాంగులు వాపోయారు. మండలంలోని అన్ని సచివాలయాల వద్ద పింఛన్ల తీసుకునేందుకు వచ్చిన వారితో నిండి కనిపించాయి. జగన్ ప్రభుత్వంలో తమకు నేరుగా ఇంటి వద్దనే పింఛన్ అందేదని, ఎన్నికలను అడ్డంపెట్టుకొని చంద్రబాబు తమకు వలంటీర్ల చేత 1వ తేదీనే పింఛన్ అందకుండా చేయాడాన్ని తప్పుబట్టారు. ముసలితనంలో ఉన్న ఆయన(చంద్రబాబు) తమ పరిస్థితిని అర్థం చేసుకోకుండా తమ బతుకులను (పింఛన్ల కోసం) రోడ్డుకు తీసుకునిరావడం అన్యాయమన్నారు. కాగా మండలంలోని అన్ని పంచాయతీలలో పింఛన్ల పంపిణీ ఆలస్యంగా ప్రారంభమైంది. పలువురికి పింఛన్లు అందించగా, చాలా మంది నిరాశతో ఇంటిబాట పట్టారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : ప్రతి నెల ఒకటో తేదీ వచ్చే సరికి తెల్లవారుజామునే గ్రామ, వార్డు వలంటీర్లు నేరుగా వృద్ధులు, దివ్యాంగులు, దివ్యాంగుల గడప తొక్కి పింఛన్ అందించేవారు. కానీ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వాలంటీర్లపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయడంతో ఏప్రిల్ నెల పెన్షన్‌దారుల పెన్షన్ కోసం సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు పండుటాకులు వారి ఆవేదనను వెలిబుచ్చారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల సచివాలయాల వద్ద ఉదయం నుండే వృద్ధులు, దివ్యాంగులు పడికాపులు కాశారు.

పెనగలూరులో..

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలో పెన్షన్ల కోసం బుధవారం సచివాలయాల వద్ద పింఛన్‌దారులు బారులు తీరారు. వృద్ధులు నడవలేక, దివ్యాంగుల రాలేక ఆటోలు, స్కూటర్ల ద్వారా సచివాలయాల వద్దకు చేరుకున్నారు. ఎండ వేడిమి అధికం ఉండటంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అరుంధతివాడ నుంచి మూడు చక్రాల బండిపై ఓ దివ్యాంగుడు నారాయణ సచివాలయం వద్దకు రాగా మురళీ ఆచారి అనే అంధుడు అతని తల్లి సహాయంతో చేతికట్టి పట్టుకొని సచివాలయం వద్దకు వచ్చి పింఛన్ల కోసం వేచి ఉన్నారు. తమకు ఈ పరిస్థితి వస్తుందని భావించలేదని వారు చెప్పారు.

• కష్టాలు తెప్పింఛన్

ఒకరి రాజకీయ స్వార్థం కోసం 66 లక్షల పైచిలుకు పింఛన్ లబ్ధిదారులు అగచాట్లు పడుతున్నారు. జగన్ ప్రభుత్వంలో 57 నెలలపాటు 1వ తేదీనే పింఛన్ తీసుకున్న లబ్ధిదారులు, నేడు ప్రతిపక్ష నేత చంద్రబాబు ఓర్వలేని తనంతో పింఛన్‌దారులకు పడిగాపులతోపాటు వ్యయప్రయాసలు తప్పలేదు. భానుడి వేడిని సైతం ఓర్చి వృద్ధులు, దివ్యాంగుల పింఛన్ల కోసం సచివాలయాల వద్ద భారీగా చేరుకున్నారు. బాబు అనాలోచిత నిర్ణయంతో పింఛన్‌దారులు ఎదుర్కొన్న కష్టాలు వారి మాటల్లోనే..

– సాక్షి, నెట్‌వర్క్

పింఛన్ కోసం వెళ్లాలంటే భయమేస్తుంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్లు ఫించన్ 1వ తేదీనే ఇంటికి వచ్చి ఇచ్చేవారు. అదే మాకు బాగుండేది. కానీ చంద్రబాబు మా వృద్ధులపై చిన్నచూపు చూసి ఫించన్ తీసుకోనీయకుండా ఎన్నికల కమిషన్ ఫిర్యాదు చేసి, మమ్మల్ని ఇబ్బందులకు గురి చేశారు. ఈ వయసులో సచివాలయానికి ఎండకు వెళ్లాలంటే ఎక్కడ వడదెబ్బ తగులుతుందోనని భయమేస్తోంది. వలంటీర్లను, మమ్ములను ఇబ్బంది పెట్టడం చంద్రబాబుకు తగదని జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యి వలంటీర్ల ద్వారా మేము ఫించన్ ఇంటి వద్దనే తీసుకుంటాం.

– నేతగాని సుబ్బరాయుడు, సిద్దవటం, వైఎస్‌ఆర్ జిల్లా

తెల్లారే పింఛను వచ్చేది



జగనన్న పాలనలో ఇంటి వద్దకే వలంటీరు వచ్చి పింఛను ఇచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడం తాము ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎండలో సచివాలయం వద్దకు వెళ్లాలంటే ఇబ్బందిపడ్డాం. వలంటీరు సేవ విలువ మాకు ఇప్పుడు తెలిసివచ్చింది. పేదలను ఇబ్బంది గురిచేయడం భావ్యం కాదు.

– కుప్పాల జయమ్మ, నందలూరు

ఆందోళనకు గురి చేశారు



వలంటీరు ఇంటి వద్దకు ఫించన్ ఇచ్చిన ఐదేళ్ల కాలంలో ఎటువంటి ఇబ్బందులు పడలేదు. 1వతేదీ పింఛను వస్తే ఆసుపత్రికి తదితర ఖర్చులు పెట్టుకునేవారం. వలంటీరు లేకపోతే వృద్ధులు, దివ్యాంగులు, మంచలో ఉన్నోళ్లు పింఛను తీసుకోవాలంటే చాలా కష్టం. వలంటీరల సేవలు ఎంతైనా అవసరం.

– పఠాన్ జైనబీ, నందలూరు


సంబేపల్లె మండలంలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న అవ్వాతాతలు


రాజంపేట టౌన్: పింఛన్ కోసం క్యూలో నిల్చున్న వృద్ధులు, దివ్యాంగులు


ఓబులవారిపల్లె: వృద్ధులకు అల్పాహారం అందజేస్తున్న అశోక్‌రెడ్డి


పెనగలూరు సచివాలయం వద్ద పింఛన్ కోసం వేచివున్న దివ్యాంగులు, వృద్ధులు


లక్కిరెడ్డిపల్లె మండలంలో పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

చిన్నమండెం : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తూ ప్రజలకు సేవ చేస్తుంటే తమపై రాజకీయ పార్టీలు నిందలు వేస్తున్నాయనే ఆవేదనతో చిన్నమండెం మండలంలో పలువురు వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. మిగతా వలంటీర్లు కూడా ఇదే బాట పట్టనున్నారు. ఈ సందర్భంగా వారు బుధవారం స్థానిక ఎంపీడీఓ రామకృష్ణకు రాజీనామా పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 50 నెలలుగా ఎలాంటి రాజకీయాలకు ప్రభావితం కాకుండా నిస్వార్థంగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. పెన్షన్లు ఇవ్వకుండా తమను అడ్డుకోవడం కలచివేసిందన్నారు. తమ దగ్గరనుంచి మొబైల్ సిమ్స్, డివైస్‌లు తీసేసుకున్నారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ సేవలకు రాజకీయాలను ఆపాదించి ఈసీకి ఫిర్యాదు చేయడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో చిన్నమండెం-1, కలిబండ, పడమటికోన గ్రామ వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేసినట్లు వారు వివరించారు.


ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

వేసవి తాపానికి వాటర్ బెల్


వాటర్ బెల్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి

- రోజుకు మూడు సార్లు స్కూళ్లలో వాటర్ బెల్ కార్యక్రమం
- విద్యార్థుల ఆరోగ్యంపై పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక దృష్టి

సంబేపల్లె : ప్రస్తుతం పలు చోట్ల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదై వడగాల్పులు వీస్తున్న నేపథ్యంలో విద్యార్థులు వేసవి తాపానికి గురికాకుండా ఉండడానికి వాటర్ బెల్ రక్షణగా ఉంటుందని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. పాఠశాల విద్యాశాఖ గౌరవ కమిషనర్ ఎస్ సురేకుమార్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం సంబేపల్లె మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాటర్‌బెల్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడటంతోపాటు వారు ఎండ వేడిమితో డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు వాటర్‌బెల్ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. విద్యార్థులు పాఠశాలలో రోజుకు మూడు సార్లు క్రమం తప్పకుండా నీరు తాగేలా (ఉదయం 8:45, 10:05, 11.50గంటలకు) వాటర్ బెల్‌ను మోగించడం జరుగుతుందన్నారు. ఇది వరకే పాఠశాలలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచడం, జగనన్న గోరుముద్ద కింద దాతల ద్వారా మజ్జిగ ప్యాకెట్లను విద్యార్థులకు అందజేయడం జరుగుతుందన్నారు. శీతల పానియాలు సేవించవద్దన్నారు. ఇంటిదగ్గర పిల్లల తగినన్ని నీళ్లు తాగేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా గంట కొట్టి విద్యార్థులచే నీళ్లు తాగించే విధంగా నిర్ణయం తీసుకున్న విద్యాశాఖను పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులతోపాటు జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రెడ్డయ్య, నబి రసూల్, విజయసారధిరెడ్డి, వెంకట్రామరాజు పాల్గొన్నారు.

ఘనంగా జెనిత్ 2కే24

పీలేరు రూరల్ : స్థానిక చిత్తూరు మార్గంలోని ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జెనిత్ 2కే24 ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన కార్యక్రమానికి వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 128 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి పేపర్ ప్రెసెంటేషన్, పోస్టర్ ప్రెసెంటేషన్, టెక్నికల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ ఎం.పి. అవినాష్ కుమార్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం హీరోయిన్ స్పందన, ప్రముఖ హాస్యనటులు రవికిషోర్, అవినాష్, తాగుబోతు రాజమౌళి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఓటింగ్ శాతాన్ని పెంచాలి

నందలూరు(రాజంపేట) : సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలని రాజంపేట ఆర్డీఓ మోహన్‌రావు రెవెన్యూ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన నందలూరు గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ఆదర్శ ఓటింగ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు కోసం ప్రత్యేక శ్రద్ధ వహించి వెయిటింగ్ రూమ్స్ ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ల కోసం షామియాన, నీరు, ఇతర సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, స్వీప్ మోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, సర్వేయర్ ఓబయ్య, వీఆర్‌ఓలు చంద్రశేఖర్ రాజు, గంగాధర్, వెంకటరమణ, శివప్రసాద్, లక్ష్మయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.


మోడల్ పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ

సంక్షేమ సారథి వైఎస్ జగన్

సిద్దవటం : ప్రజా సంక్షేమ పథకాలను అమలుపరచిన సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర గృహ నిర్మాణాల శాఖ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తనయుడు ఆకేపాటి భరత్‌రెడ్డిలు అన్నారు. సిద్దవటం మండలంలోని మాధవరం–1 మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్‌కేఆర్ నగర్, బంగారుపేట, అలీనగర్, బెడుసుపల్లి కాలనీ, మహబూబ్ నగర్ గ్రామాల్లో వారు బుధవారం విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి ఇల్లు తిరిగి కరపత్రాలను అందజేస్తూ వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎంపీగా పోటీ అభ్యర్థి పి.వి.మిథున్‌రెడ్డిల ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకు చేర్చిన ప్రజానేత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఇంటి వస్తున్న పింఛన్‌ను లబ్ధిదారులకు అండగా చేసిన దుర్మార్గుడు ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు అంటూ మండిపడ్డారు. చంద్రబాబు కారణంగా పింఛన్‌ల కోసం మండుటెండల్లో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. వలంటీర్లపై కుటిల నీతి ఈ రోజు బయటపడిందని, చంద్రబాబుకు ప్రజలు బుద్ధిచెప్పే రోజు దగ్గరలో ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి పల్లె సుబ్బరామిరెడ్డి, వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్ మేకల సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు శివయ్య, లక్ష్మిరెడ్డి, పార్టీ నాయకులు అరవ నారాయణరెడ్డి, జానపాటి సుబ్బరాయుడు, డి.రమణారెడ్డి, వెంకట్, గూండ్ల సుబ్బరాయుడు, క్రిష్టారెడ్డి, గాలి ఓబులయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎస్‌కేఆర్ నగర్‌లో ఎన్నికల ప్రచారంలో నాయకులు

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : పేదల ఆకలి విలువను తెలియజేయడమే రంజాన్ ఉపవాసాల ముఖ్య ఉద్దేశమని, అందుకే ఈ నెలలో పేద ముస్లింలకు దాన, ధర్మాలు అందజేస్తారని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల రింగ్ రోడ్డు వద్ద మోటార్ వర్కర్స్ అండ్ ఆటోమొబైల్స్ షాప్ ఓనర్స్, ఆటోనగర్ వైస్ ప్రెసిడెంట్ ఎలక్ట్రీషియన్ ఇర్షాద్ చాన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజ్ బాషా, రౌనక్, కొలిమి చాన్ బాషా, ఎస్‌పీఎస్ రిజ్వాన్, షబ్బీర్, గౌస్‌ఖాన్, అన్నా సలీం, జాఫర్ అలీఖాన్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, ఇనాముల్లా, అబుజర్, ఫిరోజ్, మోక్షిత్, కో –ఆప్షన్ హజరత్ ఖాదర్‌వలి, జావిద్, అమీర్, ఇఫీర్, ఇర్షాద్, నాగరాజ, రవి, రహంతుల్లా, షేరానీ, రజూల్ ఖాన్, షరీఫ్, మున్నా, జిలాన్, ఎస్.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు


పన్నులు పురపాలికలోనే చెల్లించాలి


కమిషనరు రాంబాబు

రాజంపేట : పన్నులు పురపాలిక కార్యాలయంలో నైనా, సీడీఎంఏ వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలని పట్టణ వాసులను రాజంపేట పురపాలక సంఘం కమిషనరు రాంబాబు కోరారు. బుధవారం కమిషనర్ మాట్లాడుతూ కొందరు అపరిచిత వ్యక్తులు 8125761327 నెంబరు నుంచి పట్టణ వాసులకు ఫోన్ చేసి మున్సిపాలిటీ పన్నులు 9966916639 అనే నెంబరుకు ఫోన్‌పే చేయాలని కోరినట్లు సమాచారం వచ్చిందన్నారు. ఫోన్ సమాచారం మేర పన్నులు చెల్లించి మోసపోకూడదన్నారు. పన్ను చెల్లింపుదారుల ఫిర్యాదు మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. ఆస్తి పన్నులు, ఖాళీ జాగా పన్నులు, నీటి పన్నులు నేరుగా పురపాలక సంఘంలోని కౌంటర్ వద్ద చెల్లించి రసీదు పొందాలన్నారు.

పచ్చదనం పర్యావరణానికి శ్రేయస్కరం

పుల్లంపేట : పచ్చదనం గురించి విద్యార్థులకు బుధవారం మండలంలోని బావికాడపల్లె జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో పచ్చదనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జాతీయ హరిత దినోత్సవాన్ని పురస్కరించుకుని జి.గంగాదర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి భావితరాలకు పచ్చదనం అందించేందుకు ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలని తద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. సకాలంలో వర్షాలు లేక ఇటు ప్రజలు, రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ప్రతి ఒక్క విద్యార్థి చెట్లు పెంచేందుకు తలిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామిరెడ్డి, గంగయ్య, సాంబశివరావు, భాస్కర్, శాంతి పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం